సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ యాదవ్ మిత్ర కాలనీకి చెందిన రవికుమార్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేకు సంబంధించిన చెక్కును శుక్రవారం లబ్ధిదారునకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు దరఖాస్తుల పెట్టుకున్న వెంటనే నిధులు మంజూరు చేయించి వారికి చెక్కుల రూపంలో సాయం అందిస్తున్నామన్నారు. మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, పాపయ్యయాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శంషాబాద్: భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల పోస్టర్‌ను పట్టణంలో ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. శంషాబాద్‌లో ఏప్రిల్ 21, 22వ తేదీల్లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. కార్మికుల శ్రమదోపిడీని అడ్డుకునేందుకు మహాసభల ద్వారా ప్రభుత్వానికి హెచ్చరిస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు శేఖర్‌రెడ్డి, ఎస్.మల్లేష్, నరసింహారెడ్డి, నర్రగిరి, రాచమల్ల యాదగిరి, ప్రభు, షకీల్ పాల్గొన్నారు.

చిత్రపురి కాలనీలో బీజేపీ నాయకుల పర్యటన

మణికొండ: చిత్రపురి కాలనీలో బీజేపీ బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రపురిలో బస్తీ దవాఖానా పనితీరు, రోగులకు అందుతున్న సేవలు, మున్సిపల్ సానిటేషన్ పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. నాయకులు సి.బీరప్ప, ఎం.రాఘవరెడ్డి, ఆనంద్‌రావు, రాములు, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజాదరణ

అత్తాపూర్: ప్రజల్లో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ మరింత పెరుగుతోందని అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. శుక్రవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాండురంగనగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఇంటికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకువెళ్లేందుకు విస్తృత ప్రచారాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా సెక్రటరీ కొమురయ్య, ఆర్.రాజశేఖర్, ఎస్.విజయ్‌కుమార్, రావుల జగన్, రాజుపైల్వాన్, లకన్, పి.వెంకట్‌రెడ్డి, శశికాంత్‌శర్మ, విజయస్వామి, ముఖేష్, విజయరావత్, భరత్, ఉమ, కిషన్, బాలకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మధుబన్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రధాన రోడ్డుపై...

మురుగుకు అడ్డుకట్ట పడేనా?

- మైలార్‌దేవ్‌పల్లిలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య వ్యవస్థ
- ప్రధాన రహదారులను ముంచెత్తుతున్న మురుగు
- మురుగు, దుర్గంధంతో రోగాల బారిన ప్రజానీకం
- ఫిర్యాదులపై స్పందించని అధికార యంత్రాంగం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతోంది. నెల రోజులుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని డివిజన్ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

- ప్రధాన, అంతర్గత రహదారులనే తేడా లేకుండా డ్రైనేజీల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. అరికట్టాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.
- మధుబన్‌కాలనీ ప్రధాన రహదారి, టీఎన్జీవోస్ కాలనీ, లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రధాన రహదారులపై నెల రోజులుగా మురుగు నీరు ప్రవహిస్తున్నది. రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు మహిళలు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మురుగు నుంచి వెలువడే దుర్గంధాన్ని భరించలేక ముక్కున వేలు వేసుకొని వెళ్లాల్సి వస్తోంది. దుర్వాసనతో ప్రధానంగా చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. స్థానిక నాయకులు, వ్యాపారులు జలమండలి అధికారుకు ఆన్‌లైన్ ద్వారా, ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం పూట దేవాలయానికి వెళ్లే భక్తులకు మురుగు తీవ్ర ఇబ్బందులను కల్గిస్తోంది.
- జలమండలి సూపర్ వైజర్ వినయ్ కుమార్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఆ మురుగు నీరు డ్రైనేజీ నుంచి రావడంలేదు ఊటలా భూమిలోంచి వస్తున్నదని, జీహెచ్‌ఎంసీ వారికి ఫిర్యాదు చేస్తే బాగుంటుందని చెబుతున్నారు. జలమండలి డీజీఎంకు అనేక మార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేసే తీరిక లేదనట్టు కనబడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యం మురుగుతో బాధపడాల్సిందేనా అంటు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి మురుగునీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రహదారి పొడువునా మురుగు

మా గోడు ఎవరికి చెప్పాలి?



మధుబన్‌కాలనీలోని ప్రధాన రహదారిపై నెల రోజులుగా మురుగు నీరు ప్రవహిస్తున్న పట్టించుకునే నాథుడే లేడు. జలమండలి సూపర్‌వైజర్ వినయ్‌కుమార్‌కు తెలిపినా మా పరిధిలోకి రాదు అనే సమాధానం ఇస్తున్నారు. మా గోడు ఎవరికి చెప్పాలి?. నా షాపు ముందు మురుగు నీరు ప్రవహిస్తుంటే వ్యాపారం ఎలా చేసుకోవాలి. మీకు దండం పెడతా తొందరగా సమస్యను పరిష్కరించండి.

– మ్యాకం ప్రసాద్, మధుబన్‌కాలనీ

పట్టించుకోరా?



రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మురుగు నీటితో రోగాలు వస్తున్నాయి. మా ఇంట్లో చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. వారు రోడ్డుపై నడవాలంటే ఆందోళన చెందుతున్నారు. జలమండలికి చెబితే జీహెచ్‌ఎంసీ అంటున్నారు. జీహెచ్‌ఎంసీకి చెబితే జలమండలి వారు చూసుకుంటారని చెబుతున్నారు. ఇద్దరి మధ్య ప్రజలు నలిగిపోతున్నారు. తొందరగా మురుగు సమస్యను పరిష్కరించండి.

– ఎం.వెంకటేష్, టీఎన్జీవోస్ కాలనీ

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తచెదారం ఇతర వ్యర్థాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయడం నిషేధం అని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లోని బైరాగిగూడలో ఇంట్లో నుంచి వచ్చే రోజువారీ చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటో కార్మికులకు ఇవ్వాలంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడం నిషేధించి స్వచ్ఛ బండ్లగూడ జాగీర్ సాధనకు సహకరించాలని కోరారు. రహదారిపై స్వీపింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే 1వ డివిజన్‌లోని కేకేనగర్ ఫేస్-2లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. శానిటరీ జవాన్లు రామాంజులు, రాము తదితరులు పాల్గొన్నారు.



బైరాగిగూడలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

ఆస్తిపన్ను వసూళ్లు భేష్

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ 2024–25వ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లలో విధించిన టార్గెట్ కంటే రూ. 2 కోట్లను అధికంగా వసూలు చేసినందుకు శుక్రవారం బంజారాహిల్స్ కొమురంభీమ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇల్లంబర్తి ప్రశంసాపత్రం, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. 2024–25వ ఆర్థిక సంవత్సరంలో విధించిన రూ. 51.33 కోట్ల టార్గెట్‌కు గాను రూ. 53.33 కోట్లను వసూలు చేసి రికార్డు సాధించారు. ఆస్తిపన్ను వసూళ్లల్లో బిల్లు కలెక్టర్లు, ఏఎంసీలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సహకారంతో టార్గెట్ పూర్తి చేశామని డీసీ రవికుమార్ పేర్కొన్నారు.



కమిషనర్ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న డీసీ రవికుమార్

జ్యోతిరావుపూలేకు ఘనంగా నివాళి

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన బాటలో పయనిస్తే పురోగతి సాధ్యమని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ప్రాంతంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– రాజేంద్రనగర్, మణికొండ, మైలార్‌దేవ్‌పల్లి, బండ్లగూడ



పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర



హైదర్షాకోట్‌లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగరాజు



కిష్మత్‌పూర్‌లో బీజేపీ రాష్ట్ర నేత భీమార్జున్‌రెడ్డి



కోకాపేటలో బీజేపీ నాయకులు



రాజేంద్రనగర్‌లో బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

బండ్లగూడ: వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో నల్లాల్లో తాగు నీటి సరఫరా సరిగా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్, వెంకటేశ్వరనగర్ కాలనీవాసులతో కలిసి ఆయన శుక్రవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంచినీటి ట్యాంకులు ప్రారంభించి సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మంచినీరు రాకపోవడం బాధకరమన్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయడంతో ముందుగానే వాటర్ కనెక్షన్, క్యాన్ నెంబర్ తీసుకొని మంచినీటి బిల్లులు వస్తున్నాయి కానీ మంచినీరు రాకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇకనైనా మంచినీరు అందించి ప్రజల కష్టాలను తీర్చాలని మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని మరో 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. శివసాయి కాలనీ ప్రెసిడెంట్ రమణారెడ్డి, రామారావు, రమేష్, సాగర్, వెంకటేశ్వర నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోడ కూలి ఆరుగురికి గాయాలు



కూలిన గోడ



గాయపడిన వారిని బయటికి తీస్తున్న దృశ్యం

శంషాబాద్: ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్ వద్ద గోడ కూలిన ఘటనలో ఆరుగురు గాయపడిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలివీ... ఉందానగర్ రైల్వేస్టేషన్ ప్రధాన బంగళాను ఆనుకుని ఉన్న గోడ పక్కనే కొంత మేర పునర్‌నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉదయం 9 గంటల తర్వాత కూలీలు అక్కడ పనులు చేసుకుంటుడగా ఆ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో కిందివైపు ఉన్న ఆరుగురు కూలీలపై ఇటుకరాళ్లు, మట్టిపెళ్లలు పడ్డాయి. హుటాహుటిగా స్థానికులు, రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్ పక్కనే ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఉండటంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ దుర్గలతతో పాటు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బయటికి తీసిన వారికి వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు. గాయపడిన వారిలో అనిత(40), నాగమణి(35), చందు (35), లక్ష్మీ (30), ఆంజనేయులు (38), లక్ష్మయ్య (50) ఉన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని లాలాగూడలోని రైల్వే ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నకిలీ పత్రాలతో బ్యాంక్‌కు మోసం

ఇద్దరిని అరెస్టు చేసిన నార్సింగి పోలీసులు

మణికొండ: నకిలీ పత్రాలను సృష్టించి బ్యాంకును మోసం చేసిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, పుప్పాలగూడ సెక్టార్ ఎస్‌ఐ మునీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు నరేష్ ఎంబీఏ చదువుతుండగా, దారావత్ కిషన్ బ్యాంక్‌లలో లోన్‌లు ఇప్పిస్తుంటాడు. ఇద్దరు కలిసి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్నట్టు నకిలీ ఐడీ కార్డులు, పే స్లిప్‌లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నకిలీ స్టేట్‌మెంట్‌లను సృష్టించారు. వాటి ఆధారంగా తమకు ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ లోన్ స్కీమ్‌లో రూ. 25 లక్షల రుణం కావాలని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి రుణం ఇచ్చి వారి లావాదేవీలపై అనుమానం వచ్చిన బ్యాంక్ అధికారులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి విచారణలో సదరు వ్యక్తులు ఎపుడూ టెక్ మహీంద్రాలో పనిచేయలేదని, వారు ఎస్‌బీఐ బ్యాంక్‌కు అందించిన పత్రాలు నకిలీవని తేలాయి. నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేగషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. పద్మశాలీపురం, శివాజీనగర్, శివశక్తి ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు అప్కో కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలీపురం, శివాజీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, ఎల్‌జీహెచ్‌ఎస్ ఇండస్ట్రియల్ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అబ్దుల్లా కాలనీ ఫీడర్, రహమత్ కాలనీ ఫీడర్‌లలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు పటేల్‌నగర్, రహమత్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, క్రిస్టల్ టౌన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. బండ్లగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు ఆయూషా కాలనీ, అలీనగర్, అహ్మద్‌నగర్, కింగ్స్ అవెన్యూ, యూసుఫ్ గుల్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వివరించారు.

ఓం జైభవానీ 11 కేవీ ఫీడర్ పరిధిలో...

శంషాబాద్ రూరల్: ఓం జైభవానీ 11 కేవీ ఫీడర్ పరిధిలో కొత్త లైన్ ఏబీ స్విచ్‌ల ఏర్పాటు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పెద్దషాపూర్ ఏఈ ఎ.సురేష్‌రెడ్డి తెలిపారు. తొండుపల్లి, కిషన్‌గూడ, ఊట్‌పల్లి గ్రామాల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

శంషాబాద్ ఫ్లైఓవర్‌పై ప్రమాదం

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఒకరికి తీవ్రగాయాలు

శంషాబాద్: లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా శంషాబాద్ పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ముందుగా వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఓ వ్యక్తి సీటులోంచి పూర్తిగా కిందపడటంతో బలమైన గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ప్రయాణికులకు టికెట్‌లు ఇచ్చి చిల్లర ఇచ్చే ప్రయత్నంలోనే బస్సుపై కంట్రోల్ తప్పి ప్రమాదానికి గురైందని కొందరు ప్రయాణికులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 142 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 55 సంవత్సరాల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొత్త పైప్‌లైన్‌లు వేయండి

మణికొండ: దశాబ్దాల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడి కలుషిత నీరు వృథా అవుతోందని, వాటిని వెంటనే మార్చి కొత్త పైప్‌లైన్లు వేయాలని మణికొండ మున్సిపాలిటీ 14వ వార్డు శివాజీనగర్ కాలనీ వాసులు జలమండలి అధికారులను కోరారు. మాజీ సర్పంచ్ యాలల నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.రమేష్, నాయకులు వై. జంగయ్య, నర్సింగ్‌రావు, కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై సీబీఐటీలో అవగాహన

- లక్ష్య సాధనపై ఫోకస్ పెట్టాలి
- యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారామ్

మణికొండ: డ్రగ్స్‌కు బానిసైతే వారి జీవితాలతోపాటు ఆయా కుటుంబాలు ఛిద్రం అవుతాయని, వాటి జోలికి వెళ్లకుండా జీవితంలో రాణించాల్సిన లక్ష్యాలపై ఫోకస్ పెట్టాలని యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారామ్ పిలుపునిచ్చారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు వయసు ఎన్నో అవకాశాలతో నిండి ఉంటుందన్నారు. అదే వయసు ఆత్మవిశ్వాసంతో పాటు ఆసక్తుల పేరుతో తప్పుదారి పట్టే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. డ్రగ్స్ ఒక మాయాజాలం అని తొలిసారిగా తీసుకునే సమయంలో మత్తు మాయలో పడేస్తుందని, అదే జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. ఉన్నత కుటుంబాల పిల్లలు ఎంతో మంది డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. అలాంటి కొందరి ఉదాహరణలు వివరించారు. ఇకపై సీబీఐటీ విద్యార్థులు డ్రగ్స్‌పై పూర్తి జాగ్రతంగా ఉండటంతో పాటు మీ చుట్టూరా ఉన్న సమాజాన్ని డ్రగ్స్ బారిన పడకుండా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు మాట్లాడుతూ... మాదకద్రవ్య వ్యసనం లేని, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. యాంటీ నార్కొటిక్స్ డీఎస్పీలు సుబ్బరామిరెడ్డి, హరీష్‌చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల విద్యార్థుల అభివృద్ధి, అభ్యుదయం విభాగం డైరెక్టర్ బి.లింగారెడ్డి, యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం.రాంచందర్, అధ్యాపకులు డాక్టర్ బి.ఆర్.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సీతారామ్